# పుట్టపర్తి భద్రతపై ప్రత్యేక దృష్టి



పుట్టపర్తి, సెప్టెంబర్ 7(ఆన్‌లైన్): పుట్టపర్తి సత్యసాయిబాబా 85వ జన్మదిన వేడుకల సందర్భంగా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నట్లు ఎస్పీ మనీష్ కుమార్ సిన్హా పేర్కొన్నారు. ఈ సందర్భంగా పుట్టపర్తిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. పుట్టపర్తి భద్రతపై మంగళవారం స్థానిక ప్రశాంతి నిలయంలో అదనపు డీజీపీ శివన్నారాయణ, డీఐజీ చారుసిన్హా, ఎస్పీ మనీష్‌కుమార్ సిన్హా సత్యసాయి ట్రస్ట్ వర్గాలతో సమాలోచనలు సాగించారు. నవంబర్ 23న జరుగబోవు సత్యసాయిబాబా జన్మదిన వేడుకలు సందర్భంగా భద్రతపై వీరు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసమావేశంలో రిటైర్డ్ డీజీపీ హెచ్‌జే దొర కూడా పాల్గొన్నారు. అందుకు సంబంధించి వీరు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ సమీక్ష అనంతరం ఎస్పీ మనీష్‌కుమార్ సిన్హా అర్బన్ పోలీసు స్టేషన్‌లో విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు ప్రభుత్వం ద్వారానే చేపట్టే విధంగా ప్రతిపాదనలు పంపుతామని వెల్లడించారు. పుట్టపర్తి భద్రత విషయం ప్రభుత్వం దృష్టికి ఈ వ్యవహారం తీసకెళ్తామన్నారు. కాగా సీసీ కెమెరాల ఏర్పాటు పేరుతో పట్టణంలోని బిల్డర్ల ద్వారా డీఎస్పీ నరసింహులు అక్రమవసూళ్లకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల విషయంపై విచారణ కొనసాగుతోందని ఎస్పీ వెల్లడించారు. ఆరోపణలు రుజువైతే డీఎస్పీపై చర్యలు తప్పవన్నారు. 2010 సంవత్సరంలో వివిధ నేరాల కింద రూ.3కోట్ల ప్రాపర్టీ రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు. మట్కా, గాంబ్లింగ్, వ్యభిచారం, మాదక ద్రవ్యాల వ్యాపారం నిరోధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాధారణ పౌరులు సైతం తనని నేరుగా సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. ఎవ్వరికి ఎటువంటి అన్యాయం జరిగినా తన దృష్టికి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా బెల్టుషాపుల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. వాటికి సంబంధించి ఇప్పటి వరకు 500 కేసులు నమోదైనట్లు ఆయన తెలిపారు. బాబా జన్మదిన వేడుకలకు 2500మంది సిబ్బందితోపాటు 25మంది ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా జిల్లా పోలీసు యంత్రాంగం పనిచేస్తోందన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగేది లేదని ఆయన స్పష్టం చేశారు.

**నేరాల అదుపునకు పటిష్ట చర్యలు**

**ఆరోపణలు రుజువైతే డీఎస్పీపై చర్యలు**

**ఎస్పీ మనీష్‌కుమార్ సిన్హా**

**బాబా జన్మదిన ఏర్పాట్లపై సమీక్ష**



మాట్లాడుతున్న ఎస్‌పీ మనీష్‌కుమార్ సిన్హా

## ఘనంగా శ్రావణమాస ముగింపు ఉత్సవాలు

బొమ్మనహాళ్,సెప్టెంబర్ 7(ఆన్‌లైన్) : మండల పరిధిలోని ప్రముఖ నేమకల్లు ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం శ్రావణమాసం ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు పుష్పాలంకరణ, కుంకుమార్చన, ఆకు పూజలు నిర్వహించారు. స్వామివారిని కర్ణాటక, ఆంధ్రా ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నసంతర్పణం ఏర్పాటు చేశారు. అలయ ఈఓ నర్సింహరాజు, ధర్మకర్త వన్నూర్‌స్వామిలు భక్తులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేశారు.



తాడిపత్రిలో రథయాత్ర దృశ్యం..

## జిల్లాలో వరసిద్ధి వినాయక భక్తి చైతన్యయాత్ర

**నెట్టికంటి ఆలయంలో విడిది**

**నేడు గుంతకల్లులో ఊరేగింపు**

తాడిపత్రిటౌన్, సెప్టెంబరు 7(ఆన్‌లైన్) : కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక భక్తిచైతన్య యాత్ర మంగళవారం తాడిపత్రికి చేరుకుంది. ఈ సందర్భంగా పురవీదుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ రథయాత్ర జూలై 15న శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానం కాణిపాకం నుంచి ప్రారంభమై రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానం, కాణిపాకం, తిరుమల తిరుపతి దేవస్థానం, వెంకటేశ్వర భక్తి ఛానల్‌వారు సంయుక్తంగా లోకకల్యాణార్థం నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా తాడిపత్రి పట్టణంలో పర్యటించి భక్తిచైతన్య యాత్ర నిర్వహించారు.

**కసాపురంలో...**

గుంతకల్లురూరల్,సెప్టెంబరు7(ఆన్‌లైన్): కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానం నుంచి బయల్దేరిన ధార్మిక ప్రచార రథం మంగళవారం రాత్రి కసాపురం దేవాలయం వద్దకు చేరుకుంది. ఈ రథం బుధవారం ఉదయానే కసాపురం నుంచి బయల్దేరి గుంతకల్లులోని వినాయక దేవాలయాల మీదుగా పయనిస్తుందని గుంతకల్లు కోదండ రామస్వామి దేవాలయ ఈఓ మల్లికార్జున తెలిపారు. పట్టణ వీధుల గుండా ఈ ప్రచార రథాన్ని సందర్శించుకోవాలని పట్టణ ప్రజలకు ఆయన కోరారు.

## ఐఐఎస్సీ కేంద్రం ఏర్పాటుకు కేంద్రం సుముఖం

**వ్యవసాయశాఖ మంత్రి రఘువీరారెడ్డి వెల్లడి**

అనంతపురం,సెప్టెంబర్7(ఆన్‌లైన్): జిల్లాలో ఐఐఎస్సీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌సైన్స్) కేంద్రం ఏర్పాటుకు కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి రఘువీరారెడ్డితెలిపారు. ఐఐఎస్సీ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నాలను విరమించుకోలేదని ఆయన అన్నారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి తన హయాంలో బెంగుళూరులోని ఐఐఎస్సీ రెండో క్యాంపస్‌ను అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేయించేందుకు ప్రత్యేక చొరవ చూపారన్నారు. గత నెలలో రాష్ట్రపతి ప్రతిభాపాటిల్‌తో జరిగిన సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్లిన సమయంలో కేంద్ర మంత్రి కపిల్ సిబాల్‌ను కలిపి ఈ విషయంపై విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఐఐఎస్సీ క్యాంపస్ ఏర్పాటుకు కావాల్సిన వెయ్యి ఎకరాల భూమిని బెంగుళూరు విమానాశ్రయానికి 70కిలోమీటర్ల దూరంలో జిల్లాలో ఇదివరకే గుర్తించినట్టు చెప్పారు. త్వరలోనే క్యాంపస్ ఏర్పాటు జరుగుతుందన్నారు.

## ఆన్‌లైన్ విలేఖరి వైద్యఖర్చుల కోసం కలెక్టర్ ఆర్థిక సాయం

అనంతపురం,సెప్టెంబర్7(ఆన్‌లైన్): ఉరవకొండ ఆన్‌లైన్ విలేఖరి రంగనాయకులు వైద్య చికిత్స కోసం కలెక్టర్ బి.జనార్ధన్‌రెడ్డి తక్షణ ఆర్థిక సాయం కింద రూ.10వేలు అందజేశారు. ఇటీవల ద్విచక్రవాహనంలో వెళుతుండగా ప్రమాదవశాత్తు రంగనాయకులుకు కాలు విరిగింది. దీంతో చికిత్సనిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షలు నిర్వహించిన త ర్వాత కిడ్నీలు, లివర్ సమస్య ఉందని వైద్యులు తేల్చారు. దీంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆంధ్రప్రదేశ్ వ ర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రజ్యోతి ఎడిషన్‌ఇన్‌చార్జి ప్రభాకర్‌నాయుడు, బ్యూరో ఇన్‌చార్జ్ రఘురామారావు, పలువురు జ ర్నలిస్టులు మంగళవారం కలెక్టర్ క్యాం ప్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి రంగనాయకుల ఆరోగ్య పరిస్థితిగురించి వివరించారు. దీంతో రెడ్ క్రాస్ సొసైటీ అధికారి రామసుబ్బయ్య ద్వారా విలేఖరి వైద్య ఖర్చులకు రూ.10వేలు ఆర్థికసాయం చేశారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం


